నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | ఏప్రిల్ 20, 2024 | www.navatelangana.com

బెదిరింపులకు పాల్పడుతున్న హోంగార్డుపై కేసు

నవతెలంగాణ-నిర్మల్



మోసం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న హోమ్‌గార్డుపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హోమ్‌గార్డు షమీ ఉల్లాఖాన్ కొన్ని రోజుల క్రితం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తుండేవాడు. ఆ సమయంలో పట్టణంలోని పలువురితో పరిచయాలు పెంచుకుని తక్కువ ధరకు భవన నిర్మాణానికి సంబంధించిన సామగ్రి సిమెంట్, ఇసుక, ఇటుక, స్టీల్ ఇతర సామానులు ఇప్పిస్తానని నమ్మించి పలువురు నుండి పలుమార్లు ఫోన్‌పే, నగదు రూపంలో లక్షల రూపాయలు తీసుకున్నాడు. ఒప్పుకున్న సామాగ్రి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. అడిగితే బెదిరింపులకు పాల్పడ్డాడు. ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ వంద రోజుల ఉపాధి పనులు చేయాలి

నవతెలంగాణ-నేరడిగొండ

ప్రతి కూలీ ఉపాధి హామీలో వంద రోజులు పని చేసి ఉపాధి పొందాలని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం రాజ్‌గార్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రూ.272 ఉన్న కూలీ ప్రస్తుతం రూ.300కు పెరిగిందన్నారు. కూలీలకు ఎటువంటి ఇబ్బందులున్న తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, టీఏ, ఎఫ్ఎ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



అగ్రనేతల చూపు..ఆదిలాబాద్ వైపు..!

- మరింత హీటెక్కనున్న లోక్‌సభ సమరం
- జిల్లాలో ఎన్నికల ప్రచారం కోసం రాక
- ఈ నెల 22న సీఎం రేవంత్..24న మహారాష్ట్ర సీఎం
- బస్సు యాత్ర నిర్వహించనున్న మాజీ సీఎం కేసీఆర్
- బహిరంగ సభలు, రోడ్ షోలతో ఆకట్టుకునే ప్రయత్నం





ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. ఇందులో భాగంగా ఆయా పార్టీల అగ్రనేతలతో ప్రచారం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోక్‌సభ ఎన్నికలను సైతం ఆయా పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఆయా పార్టీల అగ్రనేతలు ప్రచారం నిర్వహించడం ద్వారా జనాలను సులువుగా ఆకట్టుకోవచ్చని భావిస్తున్నాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానుండగా.. బీజేపీ అభ్యర్థికి మద్దతుగా మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్‌షిండే రానున్నట్లు తెలుస్తోంది. మరోపక్క బీఆర్ఎస్ అభ్యర్థి తరపున ప్రచారానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం జిల్లాలో బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వీరితో పాటు ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలు సైతం ఇక్కడకు వచ్చి ప్రచారం చేపడుతారని తెలుస్తోంది. వారి ప్రచారంతో ఆదిలాబాద్ లోక్‌సభ సమరం మరింత హీటెక్కనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ సమరం హీటెక్కిస్తోంది. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో రాజకీయ పరిణామాలు రసవత్తరంగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల పర్వం ఊపందుకోగా.. ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ అదే ఉత్సాహం కనిపిస్తోంది. ముఖ్యంగా ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఏడు నియోజకవర్గాలు ఉండగా పెద్దపల్లి పరిధిలో మరో మూడు నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం బీజేపీ చేతిలో ఉండగా.. ఈ స్థానంలో పాగా వేయాలని కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. బీజేపీ మరోసారి సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది. ఇప్పటికే ఆయా పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు ఖరారు కావడంతో పల్లెలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఎండలను సైతం లెక్క చేయకండా ప్రచార పర్వంలో నిమగ్నమయ్యారు. దీనికి తోడు అగ్రనేతలు ప్రచారానికి వస్తే పార్టీల కార్యకర్తలు, శ్రేణుల్లో మరింత ఉత్సాహం వస్తుందని.. వారు ఇచ్చే హామీలతో ప్రజలను ఆకట్టుకోవచ్చని ఆయా పార్టీలు భావిస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది.

అగ్రనేతల రాకతో సందడి..!

నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థుల తరపున అగ్రనేతలు హాజరుకానున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగానూ ఆయా పార్టీలకు చెందిన జాతీయ, రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలు జిల్లాలో ప్రచారం నిర్వహించి ప్రజల్లో ఉత్సాహం నింపారు. తాజాగా లోక్‌సభ ఎన్నికల సందర్భంగానూ అగ్రనేతలు ప్రచారానికి రానున్నారు. తాజాగా కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న ఆత్రం సుగుణ తరపున ఒక సెట్ నామినేషన్ దాఖలు కాగా.. ఈ నెల 22న మరో సెట్ వేయనున్నట్లు తెలిసింది. అదే రోజున ఆదిలాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానుండటంతో ప్రజల్లో మంచి క్రేజ్ వస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ సభకు సంబంధించి డైట్ మైదానంలో ఏర్పాట్లు కూడా ప్రారంభించారు. బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన ఆత్రం సక్కు సైతం ఒకటి, రెండు రోజుల్లో నామినేషన్ వేయనున్నారు. ఈయన తరపున ప్రచారానికి ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో బస్సు యాత్ర ద్వారా ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే ఆయన పర్యటన ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. ఇక బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదే రోజున ప్రచారానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే హాజరుకానున్నట్లు తెలిసింది. ఈ పార్టీ అభ్యర్థి తరపున ప్రచారానికి త్వరలో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం జిల్లాకు రానున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇలా ఆయా పార్టీలకు చెందిన అగ్రనేతలు జిల్లాకు రానుండటంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కనుందనే అభిప్రాయం వ్యక్తమవుతంది. ప్రధాన పార్టీలన్ని లోక్‌సభ సీటుపై కన్నేయడంతో ఈ స్థానం ఎవరి పరమవుతుందోనని జనాల్లోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాలు జిల్లా ఎన్నికల అధికారికి అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వంశీ

నవతెలంగాణ-మంచిర్యాల

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో రెండవ రోజు శనివారం సందడి నెలకొంది. మొదటి రోజు అంతంత మాత్రమే అయినా రెండవ రోజు మాత్రం నాయకులు హంగు ఆర్భాటాలతో తమ నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థుల ర్యాలీలు, రోడ్‌షోలతో నామినేషన్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తన నామినేషన్ పత్రాలు పెద్దపెల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజామిల్ ఖాన్‌కు అందజేశారు. పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సైతం తన నామినేషన్ పత్రలను సమర్పించారు. గడ్డం వంశీకృష్ణ ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంచిర్యాలలోని తన నివాసం నుంచి నామినేషన్ దాఖలు చేసేందుకు బయలుదేరి మొదటగ కాంగ్రెస్ సీనియర్ నాయకులూ, దివంగత కాక వెంకటస్వామి చిత్ర పటానికి పూల మాల వేసి బయలుదేరారు. వంశీ వెంట ధర్మపురీ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రామణారావులతో పాటు చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు ఉన్నారు. మొదటగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి రోడ్‌షో, నామినేషన్ వేసేందుకు సిద్ధం అయిన బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, అనివార్య కారణాల వల్ల కేటీఆర్ రావడం రద్దు అవడంతో మాజీ ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, కోరుకంటి చంధర్, దాసరి మనోహర్‌రెడ్డిలతో కలిసి తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం పెద్దపెల్లి పట్టణంలో రోడ్ షో నిర్వహించారు.

జైపూర్ : పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థులుగా కాంగ్రెస్ తరపున గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ నామినేషన్ దాఖలు సందర్భంగా మాట్లాడారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్‌తో కలిసి గడ్డం వంశీకృష్ణ నామినేషన్ పత్రాలు అందజేసి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు సేవ చేయడం కోసం రాజకీయాల్లోకి వచ్చానని, పెద్దపల్లి పార్లమెంట్ నుంచి అవకాశం కల్పించాలని కోరారు. వంశీకృష్ణతో పాటు కార్యక్రమంలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నేతకాని సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం నరేష్ తదితరులు ఉన్నారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి కొప్పులు ఈశ్వర్ నామిషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లిలో భారీ రోడ్ షో నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఓటర్లను కోరారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

21 సీపీఐ(ఎం) బహిరంగ సభను జయప్రదం చేయండి



నవతెలంగాణ-నిర్మల్

ఈ నెల 21న నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. శుక్రవారం ప్రజా సంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 21న నిర్వహించే బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింగరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా ఇన్చార్జి అడివయ్య హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. పదేండ్లుగా నరేంద్ర మోడీ సర్కార్ అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాలు, రైతాంగానికి నష్టం చేసిన తీరు ప్రజలందరికీ తెలిసిందే అనానరు. మూడోసారి గెలిపించాలని ప్రజల ముందుకు వస్తున్న బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించాలని, లౌకికవాద శక్తులను బలపరచాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతూ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి పసియుద్దీన్, పట్టణ కార్యదర్శి పోశెట్టి, పట్టణ నాయకులు సాయికిరణ్, చందు పాల్గొన్నారు.

ఆదివాసుల హక్కులను కాపాడేది కాంగ్రెసే



నవతెలంగాణ-బోథ్

ఆదివాసుల హక్కులను కాపాడేది కాంగ్రెస్ పార్టీయే అని ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కుమ్రం కోటేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పట్నాపూర్, ఇస్కుర్‌పల్లి, నక్కలవాడ, రేండ్లపల్లి, కొత్తపల్లి, లక్ష్మీపూర్ గ్రామాలలో పర్యటించి మాట్లాడారు. కేంద్రంలో బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే ఆదివాసుల చట్టాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ఆదివాసులను అడవుల నుండి వెళ్లగొట్టడానికి చట్టం తీసుకొచ్చే కుట్రం చేస్తోందన్నారు. ఒకే దేశం ఒకే చట్టం పేరిట ఆదివాసుల అస్తిత్వాన్ని ప్రశ్నిస్తున్న బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరారు. చరిత్రలోనే ఆదివాసీ మహిళకు ఆదిలాబాద్ పార్లమెంట్ టికెట్ కేటాయించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోడ్డు గంగారెడ్డి, ఇచ్చోడ వైస్ ఎంపీపీ జలాయ్ జాకు, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, నాయకులు రాంచందర్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



నవతెలంగాణ-బేల

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను ఆదరిస్తే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో శుక్రవారం మండలంలోని సోన్‌కాస్ గ్రామంలో ఆత్రం సుగుణను గెలిపించాలని ప్రచారం చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు చేతు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో సోన్‌కాస్ గ్రామ మాజీ సర్పంచ్ మెస్రం జనార్ధన్, బాపురావు, పార్టీ సీనియర్ నాయకులు రాజారాం, నకతే దత్త, సుభాష్, యువజన కాంగ్రెస్ నాయకులు నవీన్, పాండురంగ్, మారుతి, విజయ్, ఆత్రం వెంకట్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

గోలేటిలోని భీమన్న మైదానంలో శ్రీ వేణుగోపాల్ మెమోరియల్ సెమిస్టేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం కామారెడ్డి, హైదరాబాద్, సోమగూడెం, టీబీఇన్ హైదరాబాద్ క్లబ్ జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. నేడు జరగబోయే సెమీఫైనల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేయనున్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి

- వామపక్ష పార్టీ నాయకుల పిలుపు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశంలో మతోన్మాదాన్ని పెంచుతున్న బిజెపిని రానున్న పార్లమెంటు ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని, దానికోసం కలిసికట్టుగా పని చేయాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎండి. చాంద్ పాషా మాట్లాడారు. దేశంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం పది సంవత్సరాలుగా అన్ని రంగాల్ని నాశనం చేసిందని, మతోన్మాద విధానాల్ని ముందుకు తెస్తూ మత విభజన రాజకీయాలు చేస్తూ రాజ్యాంగ వ్యవస్థల్ని, ప్రజాస్వామ్య విలువల్ని నాశనం చేస్తోందని విమర్శించారు. బడా పెట్టుబడిదారులైన ఆదాని, అంబానీ తదితర దేశంలో ఉన్న 25 మంది బడా కార్పొరేటు శక్తులకు దేశ సంపదను కట్టబెట్టిందని తెలిపారు. అన్ని రంగాలను ప్రైవేటుపరం చేసిందని, ఉద్యోగ భద్రతను లేకుండా నిరుద్యోగాన్ని పెంచి పోషించిందని పేర్కొన్నారు. 80 శాతం నిరుద్యోగ యువత ఇవాళ దేశంలో ఉద్యోగాలు లేక భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరొకసారి అధికారంలోకి రావడానికి మోడీ ప్రభుత్వం అనేక రకాలుగా ఎత్తుగడలతో ముందుకు వస్తుందని, అనేక రకాల తప్పుడు హామీలను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఇస్తుందని తెలిపారు. మత రాజ్యాంగాన్ని మనువాద రాజ్యాంగాన్ని, తీసుకురావడం కోసం అనేక రకాల ప్రయత్నాలు చేస్తుందని, మధ్య యుగాల నాటి బానిస వ్యవస్థను తీసుకురావడం కోసం రాజ్యాంగాన్ని మారుస్తామని దుర్మార్గమైనటువంటి పద్ధతులకు పాల్పడుతోందన్నారు. దేశంలో కార్మికులు, రైతులు, కూలీలు, యువత ఏ రంగంలో చూసినా అభివృద్ధి కుంటుపడిందన్నారు. మరొకసారి ఓట్లు దండుకోవడానికి ఎన్నికల ఎజెండాలో భాగంగానే అయోధ్య, రాముడు విషయాన్ని ముందుకు తెచ్చిందన్నారు. గత ఎన్నికలకు ముందు పుల్వామా దాడులను వాడుకొని సైనికులను బలి చేసిందని, ఇవాళ మరొకసారి మోసం చేయడానికి రాముడు పేరును ముందుకు తెచ్చిందన్నారు. దేశానికి రాముడే శ్రీరామరక్ష అంటూ ప్రజల బలహీనతలను మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకుని పరిపాలన చేయడానికి ముందుకు వస్తున్న బిజెపికి దానికి అనుకూలంగా ఉన్న శక్తులకు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓటు రూపంలో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సదస్సులో సీపీఐ(ఎం) నాయకులు దుర్గం దినకర్, సిపిఐ నాయకులు ప్రశాంత్, వివిధ వామపక్ష పార్టీల నాయకులు జగజంపుల తిరుపతి, ఎం.సత్యనారాయణ, సాగర్, గొడిసెల కార్తిక్, టికానంద్, మాలశ్రీ, రత్నం పోషన్న, లచ్చన్న, పోశం, శ్రీనివాస్, తిరుపతి, మల్లన్న, అరుణ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-తాంసి

బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్ శుక్రవారం మండలంలో ముమ్మరంగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. వామన్‌నగర్, అంబుగావ్, గిరిగావ్, లీంగూడ, అట్నంగూడ గ్రామాలలో ఇంటింటికీ తిరుగుతు నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాల నుండి సుపరిపాలన అందిస్తోందన్నారు. కమలం పువ్వు గుర్తుకే ఓటు వేసి మరోసారి దేశానికి నరేంద్రమోడీ నాయకత్వాన్ని అందించాలని కోరారు. అనంతరం అంబుగాంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన మల్కు పటేల్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పతాంగే బ్రహ్మానంద్, మండల కన్వీనర్ ప్రవీణ్‌రెడి, తాంసి జడ్పీటీసీ రాజు, నాయకులు అరుణ్, సదానందం, మహేందర్, విలాస్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్



ప్రజలతో మాట్లాడుతున్న ప్రశాంత్ జీవన్ పాటిల్

నవతెలంగాణ-నిర్మల్

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి మామడ మండలం బూరుగుపల్లి, సోన్ మండలం గంజాల్ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎండాకాలం నేపథ్యంలో తాగునీటికి ఎలాంటి ఇబ్బదులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో తాగు నీటి సరఫరాకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు ఏర్పడితే ప్రజలు వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా అన్ని గ్రామాల్లో జరగాలని, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడితే తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి, వెంటనే తాగు నీటి సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, మండల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సామాజిక కార్యకర్త కేశవ్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని మోమీన్‌పూర, పుకట్‌నగర్‌లోని మురుగు కాలువలను పరిశీలించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండా కాలం నేపథ్యంలో అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లవద్దని అన్నారు.



ప్రమాదశావత్తు చెరువులో జారిపడి మహిళ మృతి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రమాదశావత్తు చెరువులో జారిపడి మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని రాచపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ప్రకారం.. గుండారపు లక్ష్మి(53) శుక్రవారం ఉదయం సరస్వతి కెనాల్ పక్కన కల సొంత పొలంలో పనికి వెళ్లి సుమారు ఉదయం 11 గంటల సమయంలో కెనాల్ నీటిలో కాళ్ళు, చేతులు కడగుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో జారి పడిపోయి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. భర్త గుండారపు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



ఆదివాసుల గుండెల్లో చెరగని ముద్ర..!

- ఇంద్రవెల్లి సంఘటనకు 43 ఏండ్లు పూర్తి
- స్వేచ్ఛగా నివాళి అర్పించాలి
- ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆనాడు జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో ఆదివాసులు తమ హక్కుల కోసం ఇంద్రవెల్లిలో శాంతియుతంగా సమావేశం జరుపుతుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆదివాసులు అమరులు కాగా, మరికొందరు రక్తపు మడుగులో ప్రాణాలను అరచేతిలో పట్టుకొని పుట్టకొకడు, గుట్టకొకడు వెళ్లి ప్రాణాలను రక్షించుకున్నారు. ఆ సంఘటనకు సరిగ్గా నేటికీ ఏప్రిల్ 20 నాడు 43 ఏండ్లు కావస్తోంది.

ఆనాడు ఏమైందంటే...

1981 ఏప్రిల్ 20 నాడు అప్పటి రైతు కూలీ సంఘం, పోర్క దొరలు (ఇప్పటి పీపుల్స్ వార్) ఆదివాసులు ఎదుర్కొంటున్న భూసమస్యలు, అటవీ అధికారుల వేధింపులు, పంటలకు గిట్టుబాటు ధర లేక దళారుల మోసాలు తదితర సమస్యల పరిష్కారానికి ఇంద్రవెల్లి సమీపంలోని హీరాపూర్‌లో సమావేశం నిర్వహించారు. ఆ రోజున వారాంతపు సంత కావడంతో జిల్లా నలుమూలల నుంచి ఆదివాసులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఇది గమనించిన పోలీసులు సమావేశానికి అనుమతి లేదంటూ వచ్చే ప్రజలను లోపలికి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా సమావేశానికి వెళ్లే ఓ ఆదివాసీ మహిళకు పోలీసులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరి మధ్య మాట మంతి పెరగడంతో అది కాస్త తీవ్ర స్థాయికి చేరుకుంది. దీంతో కోపోద్రిక్తురాలైన ఆ మహిళ తన చేతిలో ఉన్న కొడవలితో ఆ కానిస్టేబుల్ పొట్టలోకి కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే తన ప్రాణాన్ని వదిలిపెట్టాడు. దీంతో సమావేశంలో పోలీసులకు, ఆదివాసులకు మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. పరిస్థితి చెయ్యి దాటి పోవడంతో అప్పటి ఆర్డీఓ అంబారీష్ పోలీసుల కాల్పులకు అనుమతి నివ్వడంతో ఇంకేముంది పోలీసులు తమ తుపాకి గుండ్లకు పని పెట్టడంతో ఆదివాసులు పిట్టల్లా రాలి పోయారు. మరికొందరు అరచేతిలో ప్రాణాలను చేతిలో పెట్టుకొని నలు దిక్కుల్లా పరుగెత్తారు. ఈ సంఘటనలో కేవలం 11 మంది మాత్రమే చనిపోయినట్లు ప్రభుత్వ లెక్కలు తెలుపుతున్నాయి. కాని ఆదివాసులు మాత్రం తమ వారు పదుల సంఖ్యలో తమ ప్రాణాలను అర్పించారని ఆదివాసులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో ఆంక్షలే...

వారి స్మృతి చిహ్నంగా ఇంద్రవెల్లిలోని హీరాపూర్‌లో వారి స్మారకార్థం పీడబ్ల్యూజీ గ్రూప్ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఇక్కడ ప్రతియేటా ఏప్రిల్ 20న ఇక్కడ అమరుల నివాళి కి ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోంది. పరిసర ప్రాంతం 5కిలోమీటర్ల వరకు 144 సెక్షన్ విధించడంతో పాటు అటు ఉట్నూర్ ఎక్స్ రోడ్డు నుంచి గుడిహత్నూర్ వరకు ప్రజలు రాకుండా గట్టి పోలీసు బందోబస్తు విధించేవారు. ఆ రోజున సంస్మరణ దినానికి అనుమతులు ఇచ్చేవారు కాదు.

ప్రత్యేక రాష్ట్రంలో ఆంక్షలకు సడలింపు...

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం పోలీసుల బందోబస్తు మధ్య కొన్ని ఆంక్షలతో అమరవీరుల స్థూపం వద్దకు పూజలకు అనుమతినిచ్చింది. ప్రస్తుతం అమరులైన కుటుంబీకులతో పాటు ఆదివాసులు వారి ఆచార సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహిస్తున్నారు.

స్వేచ్ఛగా నివాళి అర్పించాలి

ఆదివాసులు ఏప్రిల్ 20న అమరులైన వారికి స్థూపం వద్ద స్వేచ్ఛగా నివాళి అర్పించాలన్నారు. పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తామని, అమర వీరుల పూజలకు మాత్రం పోలీసుల నుంచి ఎలాంటి ఆంక్షలు ఉండవని నవతెలంగాణతో పేర్కొన్నారు.

ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్

పోలీసుల తూటాలకు గాయమైందని పెళ్లి చేయలేదు



తనకు 12 ఏండ్ల వయస్సు ఉన్నప్పుడు ఇంద్రవెల్లి సమావేశానికి వెళ్లాను. అప్పటి కాల్పులకు మెడ దగ్గరి నుంచి బుల్లెటూ దూసుకు పోయింది. దేవుని దయవల్ల బ్రతికి బయట పడ్డా. ఇంత వరకు పెండ్లి చేయలేదు. అప్పటి కలెక్టర్ అహ్మద్‌బాబు ఆశ్రమ పాఠశాలలో 4వ తరగతి ఉద్యోగం కల్పించి ఆదుకున్నాడు. ఆయనే నాకు దేవుడు.

కినక మాన్కుబాయి
పిట్ట బొంగరం

ప్రస్తుతం పింఛను కూడా రావడం లేదు



ఇంద్రవెల్లి వారాంతపు సంతకు వెళ్లాను. ఆదివాసుల సమావేశం ఉందంటే మీటింగ్‌కు వెళితే పోలీసులు కాల్పులకు తన మోచేతి నుంచి తూటా దూసుకు వెళ్లింది. అప్పటి నుంచి ఏమి పని చేయలేక పోతున్నా. కనీసం పింఛను కూడా రావడం లేదు.

మడావి జంగు బాయి
గ్రామం కన్నాపూర్, సిరికొండ మండలం

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-కడెం

ఉట్నూర్ మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కడెం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కడెం మండలంలోని కల్లెడ గ్రామ మాజీ సర్పంచ్ తాటి సంజీవ్ పటేల్, కల్లెడ బీజేపీ గ్రామశాఖ అధ్యక్షులు కొడిమ్యాల నర్సయ్య, బెల్లాల్ గ్రామ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చెన్ను మల్లేష్ యాదవ్, కందుల సునీల్, చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యేను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రొద్దుటూరి సతీష్‌రెడ్డి, కిషన్ సెల్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చడం అభినందనీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేసవిలో ఎండలు మండుతున్న దృష్ట్యా ప్రయాణీకుల దాహార్తిని తీర్చాడానికి దాతలు ముందుకు వచ్చి చల్లని నీటిని అందించడం అభినందనీయమని ఆర్టీసీ ఆర్ఎం సోలోమాన్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ లయన్స్ క్లబ్ కింగ్స్ అండ్ కాటన్ సీటి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకుల సౌకర్యార్థం చల్లని నీటి ఫ్రిజ్‌ను ఏర్పాటు చేశారు. ఆర్ఎం సోలోమెన్ ముఖ్యఅథితిగా హాజరై దానిని ప్రారంభించారు. ప్రయాణీకులకు నీటిని అందించారు. ఈ సందర్భంగా ఆర్ఎం సొలొమాన్ మాట్లాడుతూ వేసవిలో ప్రయాణీకుల దాహార్తిని తీర్చేలా లయన్స్ క్లబ్ ఫ్రిజ్‌ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. దాతలు ఇలానే ముందుకు వచ్చి ఎండల నుంచి ప్రజలను రక్షించేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. లయన్స్ క్లబ్ సేవలను ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం కల్పన, లయన్స్ క్లబ్ సభ్యులు మధుసూధన్, రమాకాంత్, కరీం ఆలీ నూరాని, భగవాన్‌దాస్, అన్సర్. పుప్పాల నరేందర్, సత్యానారాయణ, బెజ్జంకి రవీందర్, బండారి దేవన్న ఉన్నారు.

నిత్యాన్నదాన సత్రానికి విరాళాలు అందజేత

నవతెలంగాణ-కుభీర్

ముధోల్ నియోజక వర్గంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం బాసర జ్ఞాన సరస్వతి మందిరం సమీపంలో మున్నూరుకాపు సంఘాల ఆధ్వర్యంలో స్థలం కొనుగోళు సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న మున్నూరుకాపు సంఘాల తరుపున విరాళాలు అందజేయడం జరిగింది. దీంతో శుక్రవారం మండల కేంద్రంలో సంఘం సభ్యులు రూ.లక్ష నూటపదహార్లు, నిగ్వ గ్రామంలో సంఘం సభ్యులు కలిసి రూ.51వేలు అందజేసినట్టు ముధోల్ నియోజకవర్గం మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రాళ్ల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాసరలో నిత్యాన్నదాన సత్రం కొరకు అన్ని గ్రామాల్లో ఉన్న మున్నూరుకాపు కులస్తులు అందరూ కలిసి కట్టుగా విరాళాలు అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కుభీర్ మండల అధ్యక్షుడు సిద్ధం వివేకానంద తాలూకా కార్యవర్గ సభ్యులు చిమ్మన్ పోశెట్టి, పుప్పాల పీరాజి ధర్మరాజ్, లక్ష్మణ్, ఎఎంసీ మాజీ చైర్మెన్ అనిల్, విజయ్ కుమార్, రాజు, తనూర్ మండల అధ్యక్షుడు పోశెట్టి, మండల మున్నూరు కాపు సంఘ సభ్యులు ఉన్నారు

రెండో రోజు ఒక నామినేషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం 2వ రోజు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి ఒక నామినేషన్ దాఖలైందని జిల్లా రిటర్నింగ్ అధికారి రాజర్షిషా పేర్కొన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఓ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ ఇన్‌ఛార్జి ఆడె గజేందర్, కరీం, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆదివాసీ శ్రీలేఖ ఒక కాపీ నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. దీంతో ఇప్పటివరకు మొత్తం మూడు నామినేషన్‌లు దాఖలయ్యాయి.

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోఈ నెల 22న సీఎం ఎనుమల రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్ దాఖలు, భారీ ర్యాలీ, బహిరంగ సభ, కోసం ఏప్రిల్ 22న సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ పట్టణ పర్యటనకు వస్తున్నారని తెలిపారు. ఆ పర్యటనకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని శుక్రవారం రౌట్ల రాజేశ్వర్ కుమారుడి వివాహానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, శాంతాపూర్ సర్పంచ్ తిరుమలగౌడ్, రాథోడ్ సురేందర్ పాల్గొన్నారు.

నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఈఈ

నవతెలంగాణ -నేరడిగొండ

మండల కేంద్రంలోని సవర్గాం గ్రామంలో నూతనంగా ఐటీడీఏ నిధులతో నిర్మించబడ్డ సవర్గాం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఈఈ రాథోడ్ భీంరావ్ సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శేఖర్, సవర్గాం గ్రామపంచాయతీ సర్పంచ్ కళ్యాణి మహేందర్ పాల్గొన్నారు.

పాఠశాలలో దుండగుల దుశ్చర్య

- మొన్న పైపులు.. నేడు బోరు ధ్వంసం..



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని బంగారుగూడ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ప్రభుత్వ ఆస్తికి భద్రత కరువైంది. ప్రతినిత్యం పాఠశాల ఆవరణలో అమర్చిన వివిధ సామాగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు కొల్లగొడుతున్నారు. తాజాగా గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పాఠశాల ఆవరణలోని చేతి పంపుకు అమర్చిన పైపును కత్తిరించి ఎత్తుకెళ్లారు. దీని విలువ సుమారు రూ.3 నుంచి 4వేలు ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ తెలిపారు. ఒక నెల వ్యవధిలోనే రెండు సార్లు ఇటువంటి ఘటనలు జరగడం గమనార్హం. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సంబంధిత అధికారులు ప్రభుత్వ ఆస్తి భద్రత విషయమై తగు చర్యలు తీసుకోవాలని హెచ్ఎం కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పట్టణంలోని రాంపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నమ్రత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పట్టణంలోని ఖుర్షీద్ నగర్, రణదీవె నగర్, సుందరయ్య నగర్, నీలనగర్, గాంధీనగర్, రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

అలాగే కైలాస్ నగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో శాంతినగర్, కుమ్మరివాడ, ఓల్డ్ హౌసింగ్ బోర్డు, ఏరోడ్రమ్ రోడ్, వాల్మీకి నగర్, అటెండర్ కాలనీ పాలిటెక్నిక్ ఫీడర్‌లలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : విద్యుత్ సరఫరాలలో శనివారం అంతరాయం ఉంటుందని ఏఈ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ ఉపకేంద్రం జీఎస్‌నగర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆదిలాబాద్ మండలంలోని రాంపూర్, పొచ్చెర, దిమ్మ, జందాపూర్, బీంసరి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పార్లమెంట్ ఎస్సీ విభాగం ఇన్‌చార్జిగా లింగంపల్లి చంద్రయ్య

నవతెలంగాణ-ఉట్నూర్



ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ విభాగం ఇన్‌చార్జిగా లింగంపల్లి చంద్రయ్య నియమిస్తూ గురువారం ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి ఆదిలాబాద్ పార్లమెంటు ఎస్సీ విభాగం ఇన్‌చార్జీగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి సీతక్కకు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

15 సీట్లు సాధించడమే లక్ష్యంగా ముందుకు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నామినేషన్ పత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ వ్యాప్తంగా 15 ఎంపీ సీట్లు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, తప్పకుండా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలవబోతున్నామని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున బోథ్, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు ఆడే గజేందర్, కంది శ్రీనివాసరెడ్డితో కలిసి శుక్రవారం నామినేషన్ వేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడారు. తెలంగాణలో 17 స్థానాలకుగాను 15 స్థానాలను కైవసం చేసుకోవడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పక్కా వ్యూహారచనతో ముందుకుకెళ్తోందని అన్నారు. తప్పకుండా ఈ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానంలో గెలవబోతున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జిల్లా చరిత్రలోనే కాంగ్రెస్ పార్టీ మొదటి సారిగా ఒక మహిళకు, అందులోనూ ఆదివాసీ బిడ్డకు అవకాశం కల్పించిందని అన్నారు. ఆత్రం సుగుణను తమ ఆడపడుచుగా భావించి ఆదరించాలని, భారీ మెజార్టీతో ఆమెను విజయతీరాలకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ మతం పేరుతో, దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తుంటే, కాంగ్రెస్ పార్టీ భిన్నత్వంలో ఏకత్వంలా అందరూ కలిసిమెలిసి ఉండాలని, ఈ ప్రాంతాన్ని సమిష్టిగా అభివృద్ధి చేసుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందని అన్నారు. గతంలో ఆరు గ్యారంటీలు, నేడు ఐదు న్యాయసూత్రాలతో ఎన్నికల బరిలోకి దిగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తారన్న నమ్మకంతో ఉన్నామన్నారు. ప్రతిఒక్కరూ ఆత్రం సుగుణను ఆదరించి పార్లమెంట్‌కు పంపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆత్రం సుగుణ కుటుంబం పేద కుటుంబమని, అనేక సమస్యలపై పోరాటాలు చేసిన కుటుంబమని తెలిపారు. అందుకే ఆమె సేవలను గుర్తించి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశమిచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రాంతవాసులు పార్టీని తప్పకుండా గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.శ్రీలేఖ, న్యాయవాది అఫ్రోజ్, మద్దతుదారు కరీంఖాన్ పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేసిన ఎస్పీ

నవతెలంగాణ-బేల



చెక్‌పోస్ట్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

తెలంగాణ రాష్ట్ర పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సరిహద్దు రాష్ట్రం అయినా మహారాష్ట్ర నుంచి మద్యం, నగదు, ఇతర నిషేధిత పదార్థాలు, వస్తువులు ఆదిలాబాద్ జిల్లాలోనికి రాకుండా చూసేందుకు బేల పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకర్ గూడ వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గౌస్ ఆలం శుక్రవారం చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 24/7 అన్ని వాహనాలను పూర్తిగా, క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందని అన్నారు. చెక్ పోస్టులను తనిఖీ చేసి ఇక్కడ ఉన్న అధికారులకు తగు సూచనలు, సలహాలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు దాదాపుగా రూ.40 నుంచి 50 లక్షలు సీజ్ చేయడం జరిగిందని అన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మహారాష్ట్ర రాష్ట్రం నుంచి నాటుసారా, గంజాయి, మాదకద్రవ్యాలు, అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘాపెట్టి అన్ని రకాల వాహనాలను తనిఖీ చేయాలని తెలిపారు. చెక్ పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండి అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అనుమానం ఉన్న, ముందస్తు సమాచారం ఉన్నా, తక్షణమే ఉన్నతాధికారులుకు సమాచారం అందించాలని తెలియజేశారు. చెక్ పోస్టులో మరింత నిఘా పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట డిప్యూటీ కమాండెంట్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమాండెంట్ స్వప్నిల్ పవార్, జైనథ్ సీఐ సాయినాథ్, సివిల్ ఆఫీసర్ సలాఉద్దీన్ ఉన్నారు.

ఎండలో పనులు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

- కిసాన్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఎండా కాలం నేపథ్యంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని ఉపాధి పనులు చేసేటపుడు కూలీలు అప్రమత్తంగా ఉండాలని కిసాన్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా మావల మండలంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలను కలిసి తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, జాతీయ కాంగ్రెస్ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం, జీవన భద్రత కోసం ఆనాడు ఉపాధిహామీ చట్టాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గెలిస్తే రూ.4వందలు అందజేస్తుందని తెలిపారు. అంతేకాకుండా ఉపాధిహామీ కూలీలకు అవసరమయ్యే పనిముట్లకు సైతం డబ్బులను చెల్లిస్తుందని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఉపాధిహామీ చట్టానికి బడ్జెట్‌లో తక్కువనిధులు కేటాయిస్తూ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటుతో బుద్ధిచెప్పి, కష్టపడే నాయకురాలు సుగుణను పార్లమెంటుకు పంపుదామని అన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న తరుణంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, తడిసెను వెంకటరెడ్డి, నలిమెల నవీన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షులు నాగరాజ్, సురేష్, ప్రభాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

అసత్యపు ఆరోపణలు మానుకోవాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



కాంగ్రెస్ నాయకులపై అసత్యపు ఆరోపణలను మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొయిరె బండు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మంత్రి దనసరి అనసూయ, సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలని అన్నారు. అసత్యపు ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బాధితుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని కౌటగూడా గ్రామంలో గత రెండు రోజుల క్రితం అగ్ని ప్రమాదంలో నష్టపోయిన గెడం లక్ష్మణ్ కుటుంబాన్ని బీజేపీ సీనియర్ నాయకుడు, జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు అరిగెల నాగేశ్వరావు శుక్రవారం వారి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆ కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సాయాన్ని, నిత్యాసర సరుకులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో నష్టపోయిన గేడం లక్ష్మణ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ సురేష్ పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అంకుసాపూర్‌లో చోటుచేసుకుంది. పట్టణ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెంగ్రే గౌరీబాయ్(36) గత కొన్ని రోజులుగా తన భర్త తిరుపతి వేదిస్తున్నాడు. ఇదే క్రమంలో గొంతు పిసికి కడుపులో తన్నడంతో గురువారం గడ్డి మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసుకుంది. వెంటనే ఆసిఫాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించి పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి మంచిర్యాల మాక్స్ కేర్ ఆస్పత్రికి తరలించారు. గురువారం రాత్రి తొమ్మిది గంటలకు బాధితురాలు మృతి చెందిందని తల్లి పుంజుబాయ్ ఫిర్యాదు మేరకు భర్త తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్యేపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్ర మంత్రి, ఆదిలాబాద్ ఇన్‌చార్జి సీతక్కపై అక్రమాలకు పాల్పడుతోందని ఎమ్మెల్యే హరీష్‌బాబు గురువారం విలేకరుల సమావేశంలో బహిరంగ లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనికి నిరసనగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చౌదరి తిరుపతి తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుపై ఏఎస్‌ఐ సుభాష్ మండల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతక్కపై, నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పపై అసత్యపు ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అంతాపూర్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సవాతి గ్రామ పంచాయతీ పరిధిలోగల అంతాపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని మాజీ సర్పంచ్ దేవ్‌రావు అన్నారు. గతంలో ఎన్నికలప్పుడు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటివరకు ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని, ప్రభుత్వాలు మారుతున్న రోడ్డు సౌకర్యం కల్పించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామాన్ని పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, మండలానికి రావడానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. రాత్రి సమయంలో వెళ్లాలంటే గుంతలు ఏర్పడ్డాయని, రోడ్డు సౌకర్యం కల్పించినట్టయితే గ్రామస్తులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పరస్పర ఆరోపణలపై విచారణ జరిపించాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అక్రమ వసూళ్లపై పరస్పర ఆరోపణలు చేసుకున్న ఘటనపై ఇరువురిపై సిట్టింగ్ జెడ్జితో విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేదరిక నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇరువురిపై విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటిని పట్టించుకోకుండా ఒకరిపై ఒకరు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించకపోగా కాలయాపన చేయడం సరైందికాదన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి సుగుణ గెలుపుకు కృషి చేయాలి

నవతెలంగాణ-దహెగాం

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో అధికారంలోకి రానుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ దేశంలో సైతం అధికారంలోకి వస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక కార్యకర్త సైనికుడిలా పనిచేసి అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపెల్లి రామారావు, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గందె వెంకటేశ్, నాయకులు సంతోష్‌గౌడ్, ఎలుక మోహన్, బండ కృష్ణమూర్తి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పూర్తయిన ఈవీఎం ర్యాండమైజేషన్

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంల రాండమైజేషన్ పూర్తి చేయడంతో పాటు నియోజకవర్గాలకు వాటిని కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, రాజకీయ పార్టీ నాయకులతో కలిసి ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందన్నారు దీనిలో భాగంగా ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 391 బ్యాలెటింగ్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 448 వివి ప్యాట్లు కేటాయించడం జరిగిందన్నారు. సిర్పూర్ నియోజకవర్గానికి 352 కంట్రోల్ యూనిట్లు, బ్యాలెటింగ్ యూనిట్లు, 403 వివి ప్యాట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి కేటాయించిన వాటిని జిల్లా కేంద్రంలోని పిటిజి పాఠశాలలో స్ట్రాంగ్ రూమ్‌లో, సిర్పూర్ నియోజకవర్గానికి కేటాయించిన వాటిని కాగజ్‌నగర్‌లోని సెయింట్ క్లారెంట్ పాఠశాల స్ట్రాంగ్ రూములో భద్రపరిచినట్లు తెలిపారు. అంతకుముందు కాగజ్‌నగర్‌కు కంటైనర్‌లో ఈవీఎంలను పోలీసుల బందోబస్తు మధ్య పంపించినట్లు తెలిపారు. ఎన్నికల పటిష్ట నిర్వహణకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని, ఎక్కడా పొరపాట్లకు తావు ఉండకుండా పనిచేయాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని, ఎన్నికల కోసం పెట్టే ప్రతి ఖర్చు లెక్క చూపాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు లోకేశ్వరరావు, కాసబోయిన సురేష్‌తో పాటు తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం తగదు

- సీఐటీయూ మండల కన్వీనర్ కుటికెల ఆనంద్‌రావు



నవతెలంగాణ-కెరమెరి

మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికుల వేతనాల విషయంలో యాజమాన్యాల నిర్లక్ష్యం తగదని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కెస్లా గూడ పంప్ హౌస్ వద్ద కార్మికులతో కలిసి మాట్లాడారు.గత నాలుగు నెలల నుండి వేతనాలు పెండింగ్‌లో ఉండటం మూలంగా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథ యజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. వేతనాల పై ప్రశ్నించినప్పుడల్లా ఒక నెల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వేసవికాలంలో నీళ్ల ఇబ్బంది రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెబుతూనే కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో మాత్రం తీవ్రమైన జాప్యం చేస్తుందని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బుద్దయ్య, చరణ్, శ్రీనివాస్, సిద్ధు, రవి, ప్రకాష్, శంకర్, కిరణ్, సుశీల్, విజేశ్, నితిన్, అంకుష్ పాల్గొన్నారు.

మద్యం, డబ్బు అక్రమ రవాణాపై నిఘా ఉంచాలి

- ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మద్యం, డబ్బు అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని, నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సురేష్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బందితో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం డబ్బు రవాణాపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. స్టేషన్లలో పెండింగ్ కేసుల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుకు సంబంధించిన ప్రతి విషయాన్ని పేపర్లలో నమోదు చేసి రికార్డు భద్రపరచాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో నది తీర ప్రాంతంలో బ్లూకోర్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఓటరు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తూ ఏర్పాట్లు చేయాలన్నారు. నేరాల నిరూపణ కోసం సీసీ కెమెరాలు ఉపయోగించుకోవాలన్నారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్, ఎలోప్మెంట్ కేసులపై కమ్యూనిటీ ప్రోగ్రామ్‌లు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయలన్నారు. ఫిర్యాదు నిమిత్తం స్టేషన్‌లకు వచ్చే వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్‌రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, కాగజ్‌గర్ డీఎస్పీ కరుణాకర్, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల సీఐలు, ఎస్సైలు, ఆర్‌ఐలు, డిసిఆర్బి, ఐటీ, విభాగాల ఎస్సైలు పాల్గొన్నారు.

మొన్న భార్య... నేడు భర్త

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్





జాండిస్ వ్యాధికి గురై సరైన వైద్యం అందక మూడు రోజుల కిందట భార్య మృతి చెందగా, తీవ్ర మానసికక్షోభకు గురైన భర్త గుండెపోటుతో శుక్రవారం మృతి చెందిన విషాద ఘటన మండలంలోని చారిగాం రోడ్డు కాలనీలో చోటు చేసుకుంది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం...దంపతులు అఫ్సానా భాను(38), షేక్ అశ్రఫ్(43) చారిగాం రోడ్డుకాలనీలో నివాసముంటున్నారు. భార్య ఆశా వర్కర్‌గా, భర్త ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. భార్య జాండిస్ వ్యాధికి గురికావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమించడంతో ఈ నెల 16న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. భార్య మరణంతో తీవ్ర మానసిక క్షోభకు గురైన భర్త గుండెపోటుతో శుక్రవారం మరణించాడు. మూడు రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ దంపతులకు కూతురు నజీయా(22) వివాహం కాగా, కుమారుడు షేర్ ఆదిల్(15) చదువుకుంటున్నాడు. మూడు రోజుల వ్యవధిలో తల్లిదండ్రులు మృతి చెందడాన్ని పిల్లలు జీర్ణించుకోలేకపోతున్నారు. అఫ్సానా భాను ఆశా వర్కర్‌గా పనిచేస్తున్నా సరైన వైద్యం అందక మరణించిందని సీఐటీయూ పట్టణాధ్యక్షుడు ముంజం ఆనంద్ తెలిపారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.5లక్షల పరిహారం చెల్లించాలని, ఆశా వర్కర్లకు బీమా, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

టోల్‌ప్లాజా వద్ద రూ.71,500 నగదు పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.71,500 నగదును పట్టుకున్నట్టు ఎస్‌ఐ సాగర్ తెలిపారు. శుక్రవారం మహారాష్ట్రలోని గడ్చిరోలికి చెందిన గుడిశెలవార్ నరేందర్ కారులో సిద్దిపేట వైపుకు వెళ్తుండగా అతని వద్ద నుండి రూ.71,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. సరైన ఆధారాలు లేని కారణంగా నగదును సీజ్ చేసి ఎస్‌ఎస్‌టీ టీంకు అప్పగించినట్టు తెలిపారు. తనిఖీలో ఎస్‌ఐ గంగన్న, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్టీ బలోపేతానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ సూచించారు. ఆసిఫాబాద్ టౌన్ నూతన అధ్యక్షునిగా నియమితులైన మొహమ్మద్ రఫిక్‌కి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. పార్టీలోకి నూతనంగా వస్తున్న వారితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. పార్టీలో ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత ఉంటుందని ఎవరు కూడా అధైర్య పడకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గుండా శ్యామ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఎండి ఆసిఫ్ అలీ, మైనార్టీ అధ్యక్షుడు షేక్ అసద్, శివరాం నాయక్ పాల్గొన్నారు

అసత్య ఆరోపణలను వెనక్కి తీసుకోవాలి

- డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య



నవతెలంగాణ - కౌటాల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కపై అసత్య ఆరోపణలు చేసిన సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీస్‌బాబు వెనక్కి తీసుకోవాలని డీసీఎంస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఇన్‌చార్జి మంత్రి సీతక్కపై అసత్యపు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ మహిళా కావడంతోనే ఇలా మాట్లాడుతున్నారని, మీరు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా కౌటాల పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే హరీష్‌బాబుపై ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఆదివాసీ మహిళా అని చులకనగా చూడొద్దని, చట్టం ముందు అందరు సమానులే అని, అది మర్చిపోయి మాట్లాడొద్దని అన్నారు. ఆయన వెంట మన్నెవార్ల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారుపెల్లి పోశం, జిల్లా అధ్యక్షుడు మెర్పెల్లి బ్రహ్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెర్పిల్లి సదాశివ్, ఆదె వసంత్‌రావు, నహీంహైమద్, డోంగ్రి మధుకర్ ఉన్నారు.

నేడు 'అలుపెరుగుని పోరాటం' పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రబీర్ పుర్కాయస్థ రచించిన అలుపెరుగని పోరాటం పుస్తకాన్ని నేడు జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఆవిష్కరించడం జరుగుతుందని ప్రజా సంఘాల నేతలు కార్తీక్, దినకర్, శ్రీనివాస్, రాజేందర్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి వక్తగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ హాజరుకానున్నట్లు, పుస్తక ప్రియులు వామపక్ష సంఘాల నేతలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

- ఝురి గ్రామపంచాయతీ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-కెరమెరి

పారిశుధ్యంపై దృష్టి సారించాలని డీపీఓ బిక్షపతి గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఝురి గ్రామపంచాయతీని డీపీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. జీపీలోని రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. వీధుల్లో చెత్త చెదారం పేరుకు పోకుండా చూడాలన్నారు. మురికి కాలువల పూడిక తీత పనులు ఎప్పటికప్పుడు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సావర్ ఖేడ జీపీలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ కృష్ణారావు, ఎంపీఓ అంజత్, మోడీ ఆశ్రమ బాలికల పాఠశాల హెచ్‌ఎం స్వర్ణలత, మాజీ సర్పంచ్ కుంరం నాణేశ్వర్, పంచాయతీ కార్యదర్శి వాజీద్ పాల్గొన్నారు.

నెలరోజుల పాటు వేసవి క్రీడా కోచింగ్ క్యాంప్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మే 1నుండి 31 వరకు జిల్లాలో సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని జిల్లా క్రీడా శాఖ అధికారిని రమాదేవి పేర్కొన్నారు. శిక్షణ శిబిరాల కోసం సీనియర్ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని, ఆసక్తి ఉన్న సీనియర్ క్రీడా కారులు, పీడీ, పిఈటీలు ఈ నెల 25 లోపు జిల్లా క్రీడల శాఖ అధికారిని కార్యాలయంలో క్రీడా సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 8008090626 నెంబర్లు సంప్రదించాలని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల

శనివారం | ఏప్రిల్ 20, 2024 | www.navatelangana.com

భర్త ప్రోత్సాహంతో డాక్టరేట్ సాధించిన సుమలత



నవతెలంగాణ-మందమర్రి

భర్త ప్రోత్సాహంతో గాదం సుమలత డాక్టరేట్ పొందారు. సుమలతకు డాక్టరేట్ లభించడంతో శుక్రవారం సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో తోటి అధ్యాపకులు ఆమెను ఘనంగా సన్మానించారు. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన సుమలత భర్త ఉదురుకోట సంపత్ ప్రోత్సాహంతో శ్రీ సత్య సాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్, మధ్యప్రదేశ్ నుండి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డెవలప్మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఎక్స్ట్రాక్షన్ మోడల్ ఫర్ సైంటిఫిక్ ఆర్టికల్స్ యూజింగ్ మిషన్ లెర్నింగ్ టెక్నిక్స్‌లో పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. గత 20 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ ఎంతో మంది బీటెక్ విద్యార్థులను తీర్చిదిద్దారు. ప్రస్తుతం హైదరాబాదులోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

పిచ్చికుక్కల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన జాడీ శంకరమ్మ అనే మహిళపై శుక్రవారం పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. శంకరమ్మ, ఉదయమే ఇంటి బయటకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఇంటి ప్రధాన ద్వారం వద్ద ఆమెపై పిచ్చికుక్క దాడి చేయడంతో రెండు చేతులు విరిగిపోయాయి, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. పిచ్చికుక్క ఆమెను విచక్షణ రహితంగా కొరికింది. ఆమెకు తీవ్ర గాయాలు అవడంతో ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

21న గోదావరిఖనిలో ఐఎన్‌టీయూసీ మహాసభలు



నవతెలంగాణ-నస్పూర్

గోదావరిఖనిలోని బృందావన్ గార్డెన్‌లో ఈ నెల 21న నిర్వహించనున్న ఐఎన్‌టీయూసీ మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంఘం సెక్రెటరీ జనరల్, శాశ్వత వేజ్ బోర్డు సభ్యుడు, స్టేట్ మినిమం వేజెస్ కార్పొరేషన్ చైర్మన్ జనక్ ప్రసాద్ కోరారు. శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. అంతేకాకుండా ముఖ్య అతిథులుగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్ రావు, వినోద్, వివేక్, రాజ్ ఠాకూర్ మక్కన్‌సింగ్, విజయ రామారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాలరావు హాజరవుతారని తెలిపారు. నాలుగు నెలల కాలంలో సింగరేణి ఎన్నికల తర్వాత కార్మికులకు ఇచ్చిన హామీలు ఎంతవరకు నెరవేర్చారన్నది చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే ఐఎన్‌టీయూసీ కార్మికులకు నెరవేర్చిన హామీలు, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, రాబోవు రోజులలో చేయబోవు కార్యక్రమాలు వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు జెట్టి శంకర్ రావు, గరిగె స్వామి, భీమ్ రావు, కలవేన శ్యామ్, తిరుపతి రాజు, ల్యాగాల శ్రీను, పెట్టెం శ్రీను, భీమ్ రవి, వెంగళ కుమారస్వామి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఉద్యోగి చేసిన సేవలతోనే మంచి గుర్తింపు

- మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేష్
- పదవి విరమణ ఉపాధ్యాయుడికి ఘనంగా సన్మానం



నవతెలంగాణ-కాసిపేట

ప్రతి ఉద్యోగి జీవితంలో పదవి విరమణ సర్వసాధారణమని, కాని ఉద్యోగి తాను చేసిన సేవలతోనే గుర్తింపు ఉంటుందని కాసిపేట మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం కాసిపేట మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలంగా తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వేముల దామోదర్‌రెడ్డి పదవి విరమణ సందర్భంగా ఘనంగా సన్మానం చేశారు. పాఠశాల హెచ్ఎం, మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సన్మాన గ్రహీత తెలుగు ఉపాధ్యాయుడు దామోదర్ రెడ్డికి శాలువాలతో పూలమాలలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మారావుపేట హెచ్ఎం సుధాకర్ నాయక్, కృష్ణ భాస్కర్, బండి రమేష్, గోపాల్‌రెడ్డి, రవికుమార్, సీఆర్పీ మంతెన రమేష్ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్-2024 ప్రీమియర్ లీగ్ పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ హ్యాండ్ బాల్-2024 ప్రీమియర్ లీగ్ పోస్టర్లను, సాధన గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల శ్రీధర్ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24, 25, 26 తేదీలలో సాధన ఎక్సలెన్సియా పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ శ్రీనివాస్, కోశాధికారి వెంకటేష్, అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రెటరీ మారయ్య, శ్రీ లక్ష్యసాధన కబడ్డీ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ కార్తీక్, శివాజీ సైనిక్ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ శీలం సాయికుమార్, హనుమాన్, కోచ్ గడ్డం సాయికుమార్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులు సిరంగి శ్రీధర్, రాంపురం నరేష్, మాడుగుల శ్రావణ్, పున్నం, సుభాష్ పాల్గొన్నారు.

బీసీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలో బీసీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మేము అధికారంలోకి వస్తే అన్ని జిల్లా కేంద్రంలో బీసీ భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారని, హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అలాగే మంచిర్యాల పట్టణంలో బీసీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఉద్యమాలు నడుస్తున్న నేపథ్యంలో మా ఆకాంక్షను గుర్తించి ప్రభుత్వం త్వరితగతిన భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు, లేని పక్షంలో బీసీ కుల సంఘాలను సంఘటితం చేసి రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, జిల్లా నాయకులు జైపాల్ సింగ్, పట్టణ అధ్యక్షుడు బోడెంకి మహేష్, నాయకులు కొంతం రాజు, అంకం సతీష్, అరేందుల రాజేశం పాల్గొన్నారు.

నాణ్యమైన పరికరాలు అందించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో నాసిరకమైన పరికరాలు కార్మికులకు యాజమాన్యం అందిస్తుందని, ఇప్పటికైనా నాణ్యమైన పరికరాలు అందించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు, శాశ్వత వేజ్ బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ-1 గనిలో ఫిట్ కార్యదర్శి దాడి రాజయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పనిముట్లు నాసిరకంగా రావడం ద్వారా కార్మికులు ఇబ్బంది పడుతున్నారని నాసిరకమైన పనిముట్లను సరఫరా చేసి యాజమాన్యం ఉత్పత్తి సాధించాలని కార్మికులపై ఒత్తిడి చేస్తుందన్నారు. సర్వే ఆఫ్ అయినా ఎస్డీఎల్ యంత్రాలను నడిపిస్తూ కార్మికులపై పని భారం పెంచుతుంది అన్నారు. ఎస్డీఎల్‌లో వాడే ఆయిల్స్ నాసిరకంగా ఉండడం ద్వారా ఆపరేటర్లకు ఇబ్బంది అవుతుందన్నారు. అదేవిధంగా ప్రతి ఏటా కార్మికులకు ఇవ్వవలసిన క్యాటగిరి ప్రమోషన్లను ఇక్కడి యాజమాన్యం ఎన్నికల కోడ్ పేరుతో కార్మికులకు ఇవ్వవలసిన ప్రమోషన్లను నిలిపివేసిందన్నారు. సింగరేణిలో ఏ డివిజన్‌లో లేని ఎన్నికల కోడ్ శ్రీరాంపూర్ డివిజన్‌లో మాత్రమే ఉందా అని ప్రశ్నించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు కార్మిక సంఘంగా కార్మికుల పక్షాన నిలబడి కార్మికుల హక్కుల సాధనకై ఎల్లవేళలా కృషి చేస్తుందని అన్నారు. భవిష్యత్తులో కార్మికుల హక్కుల కోసం గుర్తింపు కార్మిక సంఘం గా తీసుకునే పోరాటాలలో కార్మికులందరూ భాగస్వామ్యమై హక్కుల సాధనకై పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, మైనింగ్ స్టాఫ్ నాయకులు మారుపెల్లి బాబు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ సహాయ కార్యదర్శి కామెర వేణు, వైస్ ప్రెసిడెంట్ అనంతరెడ్డి, కాదం శంకర్, శ్రీనివాస్, అక్బర్, వెంకటేష్, వంశి, ప్రకాష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలి

- గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడిని ముందుగానే గుర్తించాలి
- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. మొబైల్ యాప్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా శుక్రవారం రామరావుపేట్ గ్రామాన్ని సంధర్శించిన ఆయన ఇందారం గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కడ కూడా ప్లాస్టిక్ చెత్త కన్పించకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి రోజు రోడ్లు, మురికి కాలువలు శుభ్రం చేయాలని తెలిపారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు సరిపడా ప్రతి రోజు రెండు పూటలు నీరు అందించాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్ సంధర్శించిన ఆయన కంపోస్టు పిట్‌లో కంపోస్టు ఎరువు తయారి విధానం పరిశీలించి నిరంతరంగా కంపోస్టు ఎరువును నర్సరీ మొక్కలకు వినియోగించాలని తెలిపారు. శ్మశాన వాటికల పరిసరాల్లో మొక్కలు ఏపుగా పెంచాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఈ సందర్భంగా తాగు నీటి పథకాల ద్వార నీటి సరఫరా తీరును పరిశీలించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తె అవకాశం ఉన్నందున ముందస్తుగా నీటి ఎద్దడిని గుర్తించి నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూసుకోవాలని తెలిపారు. తప్పనిసరి అనుకుంటే నీటి సరఫరా కోసం ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. డీపీఓ వెంకటేశ్వర్ రావుతో పాటు మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు సురేష్, సుమన్ ఉన్నారు.

నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు రాణించాలి



నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో రాణించాలని, వేసవి సెలవుల్లో జిల్లా సైన్స్ కేంద్రంలో విజ్ఞాన శాస్త్రాలపై ఏర్పాటు చేసిన ఉచిత సైన్స్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో వేసవి శిక్షణ శిబిరాలకు సంబంధించి గోడప్రతులు, కరపత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, ముఖ్య ప్రణాళిక అధికారి గుగ్గిళ్ళ సత్యం, జిల్లా సైన్స్ అధికారి మధుబాబులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సైన్స్ కేంద్రం, జిజ్ఞాస సంచార ప్రయోగశాల ద్వారా జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కూడా విజ్ఞానాన్ని పంచుతూ, శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా విద్యార్థులకు చేరువ చేయడం జరుగుతుందని తెలిపారు. గత 4 సంవత్సరాలుగా సైన్స్ కేంద్రం ద్వారా వేసవి సైన్స్ శిక్షణ శిబిరాన్ని కొనసాగించడం జరుగుతుందని, ఈ క్రమంలో ఈ నెల 26వ తేదీ నుండి శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు గూగుల్ ఫారంను ఈ నెల 22వ తేదీలోగా పూర్తి చేసి, శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని, సమాజంలో అనేక సమస్యలకు పరిష్కారం చూపే నూతన ఆవిష్కరణలు రూపొందించాలని అన్నారు. ఈ శిక్షణ శిబిరంలో 100 మంది విద్యార్థులకు అవకాశం కల్పించడం జరిగిందని, జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గల జిల్లా సైన్స్ కేంద్రంలో ఈ కార్యక్రమం ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 9849550200 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఎస్టీపీపీ ఉద్యోగాల్లో స్థానికులకు చుక్కెదురు

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఉద్యోగాల్లో స్థానికులకు అవకాశాలు దక్కడం లేదు. అర్హులైన ఎందరో నిరుద్యోగులు ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తుండగా స్థానికేతరులైన వారు గుట్టుచప్పుడు కాకుండా ప్లాంట్ ఉద్యోగాల్లో చేరుతున్నారని విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ క్రమంలో ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ డిపార్ట్‌మెంట్‌లో మూడు రోజుల క్రితం స్థానికేతరులైన ఇద్దరిని ఇంజనీర్లుగా నియమించినట్లు సమాచారం. అర్హత, ఎలాంటి అనుభవం లేనటువంటి వారు ఇంజనీర్లుగా నియమితులవుతుండగా అర్హత కలిగిన స్థానికులకు మాత్రం మొండి చెయ్యి చూపుతున్నారన్న ఆరోపనలు విన్పిస్తున్నాయి. అర్హులైన స్థానికులు ఉద్యోగావకాశం కోసం ధరఖాస్తు చేసుకుంటే ఇంటర్వ్యూల పేరుతో తిప్పి పంపిస్తుండగా తప్పనిసరి అవసరమై ఎవరినైనా నియమించుకుంటే అర్హతతో సంబంధం లేకుండా లేబర్ పనులు పురమాయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాంట్ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన పవర్‌మేక్ సంస్థ ఈ విషయాలపై దృష్టి సారించాలని స్థానిక నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. పవర్‌మేక్ సంస్థకు కనీస సమాచారం లేకుండా హెచ్‌ఓడీల నేతృత్వంలో కనీస అనుభం లేనటువంటి వారు ఉద్యోగాల్లో చేరుతున్నారని తెలుస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే హెచ్‌ఓడీ నార్త్‌కు చెందిన వారి కనుసన్నల్లో పవర్‌మేక్ సంస్థ పనుల నిర్వాహణ కొనసాగిస్తుందని ఆరోపనలు ఉన్నాయి. ప్లాంట్ పరిధిలో ఇప్పటికి సుమారుగా 18 మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇంజనీర్లుగా విధులు నిర్వర్తిసుండగా వీరికి ఎంత మాత్రం అనుభవం లేకపోవడం బాధాకరమని ప్లాంట్ పరిధిలో గల స్థానిక ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పవర్‌మేక్ కంపెనీ ఈ విషయంలో దృష్టి సారించాలని, సింగరేణి యాజమాన్యం సైతం ఇక్కడ జరుగుతున్న తీరు పట్ల స్పందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అర్హత కలిగిన ఎందరో ఇంజనీర్లు ఇక్కడ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుండగా పక్క రాష్ట్రాల నుంచి దొంగ చాటు నియమిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

నీరు వృథా కాకుండా చూసుకోవాలి

- ఎంపీడీఓ సత్యనారాయణ

నవతెలంగాణ-జైపూర్

అవసరానికి అనుగుణంగా నీటి వినియోగించుకోవంతో పాటు వృథా కాకుండా చూసుకోవల్సిన బాధ్యత కాలనీవాసులు గుర్తించాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం నర్వ గ్రామ పంచాయతీని సంధర్శించిన ఆయన బోరు ద్వార నీటిని సరఫరా చేస్తున్న తీరును పరిశీలించారు. వ్యక్తిగత పైప్‌లైన్ ద్వార నీటిని పొందుతున్న కాలనీవాసులు వారి అవసరాలు తీరిన తర్వాత నీటి సరఫరా నిలిపివేయకుండా నీటిని వృథా చేయవద్దని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైప్‌లైన లీకేజీలు గుర్తించి మరమ్మత్తు పనులకు ఆదేశించారు. నర్వ, ముదిగుంట గ్రామ శివారుల్లో కొనసాగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం పూట పనుల నిర్వాహణ పూర్తి చేసుకోవాలని సూచించారు. నీటి నిల్వలు పెంచుకునే విధంగా చెరవు గర్భంలో మట్టి తీయాలని సూచించారు. వరదగా వచ్చే వర్షపు నీరు ఎక్కడికక్కడ నిల్వ చేసుకునే విధంగా ట్రెంచ్‌లు తవ్వాలని తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలోని నారాయణ స్కూల్‌లో జరిగిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అలరించాయి. శుక్రవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రీ ప్రైమరి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. చిన్నారులు ప్రత్యే దుస్తులు(రోబ్స్) ధరించడంతో అందరిని ఆకట్టుకున్నారు. అతిథులు మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, పాఠశాల ఏజీఎం అనం చైతన్యరావు, ప్రిన్సిపల్ మామిడిషెట్టి కవిత లకు చిన్నారులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ప్రీ ప్రైమరి వైస్ ప్రిన్సిపల్ స్రవంతి స్కూల్ ప్రగతి నివేదికను అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ గొప్ప పేరు ప్రఖ్యాతులు, 45 సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాలలో చదవడం గర్వంగా భావించాలన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డి సంగిత రావు, జోనల్ కోఆర్డినేటర్ రవళి ప్రీయ, హైస్కూల్ డిన్ వెంకటస్వామి, ఎఓ సంతోష్ కుమార్, అమల, రాజేందర్ పాల్గొన్నారు.

అసభ్యకరమైన పోస్టులు పెట్టి ఇబ్బందికి గురి చేసిన వ్యక్తిపై కేసు

నవతెలంగాణ-రామకష్ణాపూర్

సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టి ఇబ్బందికి గురు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ జి రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం యువత జనం కోసం వాట్సాప్ గ్రూప్‌లో దానికి సంబంధించిన సోషల్ మీడియాలో గ్రూప్ అడ్మిన్ ఎర్రబెల్లి రాజేష్ అనే వ్యక్తి అసభ్యకరమైన పోస్టులు పెట్టి పాత్రికేయులను ఇబ్బందికి గురి చేసిన రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు, పత్రిక విలేఖరి దండు సదానందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల వారు పోలీస్ వారికి సహకరించాలని, ఎన్నికల సంఘం యొక్క నియమ నిబంధనలు పాటించి శాంతి పూర్వక వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని తెలిపారు. అనవసరంగా సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టి , రాజకీయ పార్టీల మధ్య గొడవలు పెట్టే వారి పైన కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

కాసిపేట-2 గనిని సందర్శించిన జీఎం



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్ సందర్శించారు. అధికారులతో కలిసి గనిలో ఏర్పాటు చేస్తున్న మ్యాన్ రైడింగ్ పనులను పరిశీలించారు. అనంతరం గనిలో పని ప్రదేశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అధికారులు, ఉద్యోగులు రక్షణతో కలిసికట్టుగా పని చేస్తూ ప్రమాద రహిత ఉత్పత్తిని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి రవీందర్, ఏజెంట్ రామదాసు, ఇంజనీర్ రామ్ ప్రసాద్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న రోగి పరారీ

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నుంచి రోగి పారిపోయినట్లు కుటుంబ సభ్యులు మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంచిర్యాల పట్టణ ఎస్ఐ కె.లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూర్ పట్టణానికి చెందిన తగరం చిరంజీవి(35) అనారోగ్యతో మంచిర్యాల లోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం చేరాడు. అడ్మిట్ చేసుకుని వైద్యులు చికిత్స అందిస్తున్న క్రమంలో చిరంజీవి గురువారం తెల్లవారు జామున ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిపోయాడు. భార్య తగరం రాజేశ్వరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. పారి పోయిన వ్యక్తి నల్లటి రంగు పోలి పింక్ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిస్తే మంచిర్యాల పట్టన పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాల్సిందిగా ఎస్ఐ కోరారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా సీనియర్ తెలంగాణా ఉద్యమ కారుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి శుక్రవారం పెద్దపల్లి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌ల్లో చేరారు. శ్రీరాంపూర్ కాలనీ నుంచి 200 మంది కార్యకర్తలతో బారీ కాన్వాయితో పెద్దపల్లికి తరలి వెళ్లారు. మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, కోరుకంటి చందర్, మనోహర్‌రెడ్డిల సమక్షంలో టీబీజీకేఎస్ కేంద్ర స్టీరింగ్ కమిటి చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కే సురేందర్‌రెడ్డి, తన అనుచరులతో చేరారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కండువా కప్పి స్వాగతం పలికారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | ఏప్రిల్ 20, 2024 | www.navatelangana.com

మనస్థాపానికి గురై మహిళా ఆత్మహత్య

నవతెలంగాణ-సారంగాపూర్



పిల్లలు కలుగడం లేదని మనస్థాపానికి గురై పురుగులమందు తాగి మహిళా ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని కుప్టి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుప్టి గ్రామానికి చెందిన బండారి మల్లవ్వ (28) సురేష్‌తో 9 సంవత్సరాల కింద పెళ్లి జరిగింది. ఇప్పటి వరకు పిల్లలు కాలేదని మనస్థాపానికి గురై తన ఇంటిలోనే పురుగులమందు తాగింది. గమనించిన కుంటుసభ్యులు నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రమోహన్ వెల్లడించారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

నవతెలంగాణ-దహెగాం



సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌పై ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అసత్యపు ఆరోపణలు మానుకోవాలని పార్టీ మండలాధ్యక్షుడు గందె వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, నాయకులు దందిరె వెంకన్న, రవి, శ్రీనివాస్, తోగయ్య, పవన్ పాల్గొన్నారు.

రూ.5లక్షల 17వేల నగదు పట్టివేత



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వేర్వేరు వ్యక్తులను నుంచి మొత్తం రూ5లక్షల 17వేల నగదును పట్టుకున్న తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో యావత్మాల్ జిల్లాకు చెందిన జాదవ్ పృథ్వీ ప్రకాశ్ వద్ద రూ.2లక్షల 67వేల నగదును పట్టుకున్నట్టు, వారి వద్ద ఎలాంటి ధృవపత్రాలు లేనినందున సీజ్ చేసినట్టు తెలిపారు. అదేవిధంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం శాంతినగర్‌కు చెందిన అంకర్ రవికుమార్ వద్ద రూ.2లక్షల 50వేలను పట్టుకున్నట్టు వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో డబ్బును సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎస్సై శ్రీకాంత్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని సబ్‌స్టేషన్‌లో శనివారం విద్యుత్ మరమ్మతుల పనులు నిర్వహిస్తున్న సందర్భంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

రిమ్స్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం రిమ్స్ ఆవరణలో శుక్రవారం లభ్యమైంది. పార్కింగ్ స్థలంలో మృతదేహాన్ని గుర్తించారు. వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గమనించిన వారు అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారం అందించారు. ఆ వ్యక్తి వద్ద బంగారిగూడ పాఠశాలలో చదువుతున్న ఒక విద్యార్థి ఫోటో మాత్రమే లభించిందని, ఇతర వివరాలేవీ ఆయన వద్ద లేవని, అవుట్ పోస్ట్ ఇన్‌చార్జ్ భూమన్న తెలిపారు. కాగా మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించినట్టు పేర్కొన్నారు.

భక్తులకు అల్పాహారం అందజేత



నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ నుంచి కొండగట్టుకు హనుమాన్ భక్తులు మహా పాదయాత్ర గా వెళ్తున్న వారికి శుక్రవారం అల్పాహారాన్ని లక్కారం గ్రామపంచాయతీ యువ నాయకులు అజ్మీరా జయచంద్ర నాయక్ అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆంజనేయుల భక్తి మార్గంలో నడవాలని, చెడు వ్యసనానికి, దూమపానానికి దూరంగా ఉంటూ మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు.

సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ జడ్పీటీసీ, టేకుమెట్ల పంకజ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా మండలంలోని గోండు గూడా, నాయక్‌గుడా, లక్ష్మీపూర్ తాండ, లోత్రొరే తదితర గిరిజన గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఆత్రం సుగుణకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆత్రం సుగుణను గెలిపిస్తేనే రాహుల్ గాంధీ ప్రధాని అవుతారన్నారు. చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-మందమర్రి



పట్టణానికి చెందిన ఎంపటి అరవింద్ కుమార్ అనే వ్యక్తి 2023 అక్టోబర్ నెలలో బైక్ మీద వెళుతూ తన ఫోన్ పోగొట్టుకోగా శుక్రవారం ఎస్ఐ రాజశేఖర్ బాధితుడికి అందచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్నా చోరీకి గురైన పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ సాంకేతిక పరిజ్ఞానంతో పోయిన మొబైల్‌ని గుర్తించి రికవరీ చేయడం జరుగుతుందని అన్నారు. 2023 జనవరి 1వ తేది నుంచి ఇప్పటివరకు మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో 61 ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పోయిన తన మొబైల్‌ని అప్పగించినందుకు బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. మొబైల్ ఫోన్లను వెతికి పట్టడంలో ముఖ్య పాత్ర పోషించిన మందమర్రి టెక్ టీం కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను ఎస్ఐ అభినందించారు.

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు జాదావార్ వివేకానంద



నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు జాదావార్ వివేకానంద అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో (ఎఫ్ఎస్‌టీ)స్క్వాడ్ టీంలు, వీడియో వివింగ్ టీంలు (వీవీటీ), స్టాటిస్టిక్స్ సర్వేలైన్స్ టీంలు (ఎస్ఎస్‌టీ) సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. వివిధ రకాల బృందాల పనితీరుకు సంబంధించిన వివరాలు, స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం, ఇతర వస్తువులకు సంబంధించిన వివరాలను జిల్లాల వారీగా సమీక్షించారు. అన్నిరకాల రిపోర్టులను సమయానికి పంపాలని తెలిపారు. రోజువారీ రిపోర్టులు తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ హాలు నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అన్ని రకాల టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు సీ విజిల్ యాప్ లో అయిదు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిష్కరించామని తెలిపారు. ఇప్పటివరకు రూ.1కోటి 19 లక్షల వరకు నగదును స్వాధీనం చేసుకున్నమని అన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు 16,089 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నమని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓలు రత్న కళ్యాణి, కోమల్‌రెడ్డి, ఈడీఎం నదీం, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



'అన్నదాన సత్రానికి మా సహకారం లేదు'

- రైస్ మిల్లర్స్ అసోసియేషన్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదాన సత్రానికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నుంచి ఎలాంటి సహకారం లేదని రైస్ మిల్లర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు చిలువేరు సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్రానికి తాము సహకరిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించిన దానిలో వాస్తవం లేదని అన్నారు. రాష్ట్రంలో కేవలం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు మాత్రమే పౌరసరఫరాల శాఖకు బియ్యం సరఫరాకు అనుమతి రావడానికి రవాణా ఛార్జీలేనని అన్నారు. ఈ జిల్లాకు ఇతర జిల్లాల నుంచి బియ్యం రవాణా అవుతున్నాయని, ఈ ఖర్చులు ప్రభుత్వానికి భారంగా ఉండటం, ఈ జిల్లాలో బియ్యం కొరత ఉండటంతో పౌరసరఫరాల శాఖకు రవాణా చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. 2022-23 రబీ, 2023-24 ఖరీఫ్ పంటకు పౌరసరఫరాల శాఖకు అనుమతి పాలనాపరంగా వచ్చిందనీ, అంతేకాకుండా 2022-23 ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలోని రైస్ మిల్లర్లు వంద శాతం బియ్యాన్ని సరఫరా చేశారని తెలిపారు. వీటన్నింటిని గుర్తించే జిల్లాకు పౌరసరఫరాల శాఖకు బియ్యం సరఫరాకు అనుమతినిచ్చారని తెలిపారు.

ఉపాధి పనులను పకడ్బందీగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా జిల్లాలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పకడ్బంధీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతిలతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న ఉ పాధిహామీ పనుల నిర్వహణలో భాగంగా ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, అధిక ఉష్ణోగ్రత దృష్ట్యా పని ప్రదేశాలలో తాగునీరు, నీడ సౌకర్యాలతో పాటు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని, వడదెబ్బకు గురైన బాధితులకు ప్రథమ చికిత్స అందించి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలని తెలిపారు. ప్రతి ఉపాధికూలీకి రోజుకు రూ.2.50 పైసల చొప్పున తాగునీటికి కేటాయించడం జరుగుతుందని, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పని ప్రదేశాలను తరుచుగా సందర్శించాలని, అవసరమైన ఏర్పాట్లను చేయాలని తెలిపారు.

మల్కేపల్లి ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ


నవతెలంగాణ-కాసిపేట



మంచిర్యాల గిరిజన అభివృద్ధి అధికారి మాడావి గంగరాం, ఏసీఎంఓ రాజమౌళితో కలిసి మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అజ్మీర నరసింహను విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఎస్ఏ-2 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పాఠశాల పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్త చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ముందు నుండే సిద్ధం కావాలని, గిరిజన సంక్షేమశాఖ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని డీటీడీఓ గంగారాం సూచించారు.

నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

- ఎంపీడీఓ శశికళ



నవతెలంగాణ-జన్నారం

నర్సరీలో ఉన్న మొక్కలు ఎండి పోకుండా చూడాలని ఎంపీడీఓ శశికళ నర్సరీ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న, నర్సరీని పరిశీలించారు. వేసవి దృశ్య, ఎండలు తీవ్రంగా ఉన్నందున మొక్కలు, ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. మొక్కలకు ప్రతిరోజు నీరు అందించి ఎండిపోకుండా చూడాలన్నారు. అలాగే గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజు ఇంటింటికి నీటిని సరఫరా చేయాలని, నిర్వాహకులకు సూచించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తామన్నారు. వాటర్ ట్యాంక్‌ను శుభ్రంగా ఉంచాలన్నారు. మంచినీటి సరఫరాపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీ ఈఓ సింగిడి రమేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-రెబ్బెన





గురుకులాల ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో మొదటిస్థానంలో ప్రైమరీ పాఠశాల లేతన్‌గూడ పాఠశాల నుంచి పరీక్షరాసిన ముగ్గురిలో ఇద్దరు ఆత్రం లక్ష్మిప్రసన్న, ఎరగటి అబిత ఎంపికయ్యారు. దీంతో వారిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామస్తులు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు కుచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు వోడ్నాల రాజేశ్వర్, ఈటల శ్రీనివాస్, గంగాధర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గ్రామానికి చెందిన దాదాపు 25 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు.

పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ తరపున చర్యలు చేపడుతున్నట్టు ఆదిలాబాద్ మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని సుభాష్‌నగర్ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడారు. పారిశుధ్య సమస్యలు ఏర్పడితే మున్సిపల్ అధికారులను సంప్రదించాలన్నారు. అంతేకాకుండా బొగ్గుతో అక్కడ గొడపై తన నెంబర్ రాయమని సూచించారు. సమస్య ఉంటే తనకే కాల్ చేయవచ్చన్నారు. కాగా గత కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులు నాలాలు శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రంగా మారడంతో పాటు దోమలు బెడద విపరీతంగా పెరిగిందని అన్నారు. దీంతో నాలాలు ఎదుట ఉన్న ఇంటివారే స్వయంగా నాలాలు తీసుకున్నారు. ఈ విషయం మున్సిపల్ అధికారుల దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించి పారిశుధ్య కార్మికులతో నాలాలను శుభ్రం చేయించారు.

సోషల్ మీడియా ఇన్‌చార్జి నియామకం

నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జిగా కాసిపేట్ సతీష్ కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి వంశీకృష్ణ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. మండల పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తానని కాసిపేట సతీష్ కుమార్ తెలిపారు.

ఉపాధి కూలీలు అడవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కామన్‌పల్లి శివారులో ఉపాధిహామీ పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు శుక్రవారం ఎఫ్ఆర్ఓ హఫీజుద్దీన్ పలు సూచనలు, సలహాలు చేశారు. అడవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు అవగాహన కల్పించారు. అడవిలో నిప్పు అంటిన వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాల వాడుక గురుంచి అవగాహన కల్పించారు. వేసవిలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై కూలీలకు వివరించారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుందని, దానికి అనుగుణంగా కూలీలు తాగునీరు, అంబలి తదితర వాటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కామన్‌పల్లి ఎఫ్ఎస్ఓ శివకుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మక్బూల్, అంజిత్, ఉపాధిహామీ టీఏ రాజేందర్, ఎఫ్ఎ సురేందర్, మేట్ గణేష్ పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు వివరాలు ఇవ్వాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు ఆసక్తి గల సీనియర్ క్రీడాకారులు, పీఈటీలు, పీడీలు వివరాలు సమర్పించాలని జిల్లా క్రీడా యువజన సర్వీసుల శాఖ అధికారి కీర్తి రాజీవ్‌రు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా అంశం, గ్రామం, మండలం ఇతరత్రా పూర్తి వివరాలను ఈ నెల 26వ తేదీన జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని 2వ అంతస్తులో గల జిల్లా క్రీడాధికార సంస్థ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అందజేయాలని తెలిపారు. మే 1 నుండి 31వ తేదీ వరకు శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, వివరాలకు 9963539234, 9866458725 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.